# భారీ మెజార్టీయే లక్ష్యంగా ముందుకెళ్లాలి

**• బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

మాదాపూర్, అక్టోబర్ 22 : వచ్చే ఎన్నికల్లో భార్టీ మెజార్టీయే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలిన శేరిలింగంపల్లి పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ ఆదిత్యా సన్‌షైన్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన కాలనీవాసుల ఆత్మీయ సమావేశంలో ఆయన స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొని మాట్లాడారు. శేరిలింగంపల్లిని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దానని, మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ. 9వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని, వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని కాలనీవాసులను కోరారు. మహిళలు, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. ప్రజల సహకారంతో అధికారులను సమన్వయం చేస్తూ రోడ్లను



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ

అభివృద్ధి చేశామన్నారు. మెరుగైన రవాణా సౌకర్యానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. శేరిలింగంపల్లి ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం స్థానికులు ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీకేనని తెలిపారు. ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలో తిరుగులేని మెజార్టీని ఇచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామన్నారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

**• మాదాపూర్ డీసీపీ సందీప్**



ర్యాలీలో పాల్గొన్న పోలీస్ అధికారులు,సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది

కొండాపూర్, అక్టోబర్ 22 : అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని మాదాపూర్ డీసీపీ సందీప్ ప్రజలకు సూచించారు. ఆదివారం మాదాపూర్ జోన్ పరిధిలోని పలు కాలనీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ బృందాలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదాపూర్ జోన్ మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సున్నిత ప్రాంతాలైన మార్తాండనగర్, ప్రేమ్‌నగర్, ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, న్యూ హఫీజ్‌పేట్‌ల్లో కాలినడకన పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎన్నికల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని డీసీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీలు శ్రీనివాస్, నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సీఆర్పీఎఫ్, సీఎస్ఐఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆనంద శంకర్‌కు 'ధైర్య'అవార్డు



నృత్య కళాకారిణి ఆనంద శంకర్‌కు ధైర్య అవార్డు అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు

మాదాపూర్, అక్టోబర్ 22: మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో 8వ రోజు నాద బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో ఆదివారం నాట్య ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు కేవీ రమణచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్నమయ్యపురం విద్యార్థులు వివిధ స్తోత్రాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయంతి నారాయణ, నృత్య మయూరి కళానికేతన్ బృందం ఆధ్వర్యంలో నివేదిత, తేజస్వి, రజిత, సృజన, లక్షణ, చాందిని, భవ్య, భావన, ధన్విత, ఆరాధ్య, మనస్విని సంయుక్తంగా అన్నమయ్య సంకీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. ప్రముఖ నృత్య కళాకారిణి ఆనంద శంకర్ క్యాన్సర్‌ను ఎదుర్కొని నాట్య వృత్తిని కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆమెకు 'ధైర్య' అవార్డును అందజేశారు. అనంతరం నిర్వాహకురాలు, పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు, సంస్థ అధ్యక్షులు నందకుమార్ చేతుల మీదుగా కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. అన్నమయ్య సమేత వేంకటేశ్వరస్వామికి హారతి ఇచ్చి ప్రసాద వితరణ గావించారు.

## దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి : ప్రభుత్వ విప్

మియాపూర్, కొండాపూర్, అక్టోబరు 22 : నియోజకవర్గ ప్రజలందరిపైనా దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ ఆకాంక్షించారు. దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆల్విన్ కాలనీ ఫేజ్ 2, జన్మభూమి కాలనీ, ఎల్లమ్మ బండ కాలనీల్లో దుర్గమ్మ పూజల్లో విప్ గాంధీ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విప్ మాట్లాడుతూ దుర్గమ్మ శక్తి, భక్తి గొప్పదని ఆమెచల్లని చూపులు ప్రజలందరిపైనా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, చంద్రశేఖర్ ప్రసాద్, కాశీనాథ్, కృష్ణ, కిషన్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



భ్రమరాంబ ఆలయంలో దుర్గాపూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గాంధీ

### ప్రజలకు ఎమ్మెల్యే దసరా శుభాకాంక్షలు


నియోజకవర్గ ప్రజలకు విప్ గాంధీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై గెలిచే విజయానికి ప్రతీకగా దసరా పండుగ ఉత్సవాలను జరుపుకుంటారని, నియోజకవర్గ ప్రజలంతా ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకోవాలని విప్ గాంధీ ఆకాంక్షించారు.



### కొండాపూర్ పరిధిలో..

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా చందానగర్‌లోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.

## చెడుపై విజయానికి ప్రతీక దసరా..



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, అక్టోబరు 22 : చెడుపై మంచి సాధిం చిన విజయానికి గుర్తుగా దసరా పండుగ జరుపుకుంటా రని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఆనందోత్సాహాలతో దసరా పండుగ నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. డివిజన్ ప్రజలు, అధికారులకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు



కొండాపూర్, అక్టోబర్ 22 : శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా శారీ మేళా, బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరి రోజు ఆదివారం సద్దుల బతుకమ్మ సంబురాల్లో శిల్పారామం మహిళా సిబ్బందితో పాటు సందర్శకులు పాల్గొని ఆడిపాడారు. అనంతరం గీత గణేశన్ శిష్య బృందం 'మహిషాసుర మర్దిని' భరతనాట్య రూపకంలో ప్రదర్శించారు. మహతి కళా సమితి శిష్య బృందం సౌమ్య, లహరి, శారద, కోమల, సంధ్య, అస్మిత కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు.

## ఎక్సైజ్ దాడులు.. మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, పట్టుబడిన నిందితులు

బాలానగర్, అక్టోబర్ 22 : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు, సనత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఆదివారం మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ నేతృత్వంలో ఫతేనగర్ పార్థీబస్తీలో సనత్‌నగర్ సీఐ బాలరాజ్, బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. పలువురు మద్యాన్ని అక్రమంగా నిల్వచేసి ఉంచగా స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, 58 బీర్లు, 38 లిక్కర్ బాటిళ్లు, 7 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**• 20 కిలోల గంజాయి పట్టివేత**

**• నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు**

మాదాపూర్, అక్టోబర్ 22: ఆటో నడుపుతూ వచ్చిన డబ్బులు సరిపోక విలాస జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో గంజాయి సేకరించి అధిక ధరకు విక్రయించడం మొదలుపెట్టాడు.. కొంతకాలం పోలీసులకు దొరక్కకుండా గంజాయి విక్రయించాడు. ఎట్టకేలకు సమాచారం తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ తిరుపతి వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన జావెద్ (ఏ1) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయి ఏపీలో తక్కువ ధరకు దొరుకుతుందని తెలుసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి సరఫరా చేస్తున్న తేజస్ ద్వారా కాకినాడ జిల్లా పత్తిపాడు వద్ద అతడిని కలిసి రూ. 3 లక్షలు




వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్, మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి

చెల్లించి 20 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. గంజాయిని చిన్న క్యారీబ్యాగ్‌లో కట్టి ట్రావెలింగ్ బ్యాగ్‌లో వేసుకుని ఈనెల 21న తెల్లవారుజా మున రైలు ఎక్కి బయల్దేరాడు. పోలీస్ తనిఖీలు జరుగుతున్నాయని తెలుసుకుని మధ్యాహ్నం 1:30 గంటలకు హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ వద్ద రైలు దిగి వెలుపల వేచి ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం పోలీసులు అతడి బ్యాగును తనీఖీ చేయగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అతడిని పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా నిందితుడు జావెద్ గత మూడెండ్లుగా రైలులో గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అతడికి భార్య, 5 గురు సంతానం ఉన్నారు. పోలీసులు నిందితుడి వద్ద సుమారు రూ. 20 కిలోల గంజాయి, మొబైల్ , వెయ్యి రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడి చాకచక్యంగా పట్టుకున్న మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, ఎస్సై వెంకటరమణ, సిబ్బందిని ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

